క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్‌తో ఆరోగ్యం

సీతానగరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యమని పీహెచ్‌సీ సీనియర్ వైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలోని పెదబోగిలి పంచాయతీ అప్పయ్యపేటలో 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీటీసీ బి.కుసుమ, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్ వేయించాలి



వెంకటాపురంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

సీతానగరం: పశు సంవర్థక శాఖ సీతానగరం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో రైతులు తమ పశువులకు ఫుట్ అండ్ మౌత్ వ్యాధి నిరోధక టీకా మందు వేయించాలని పశువైద్య సహాయ సంచాలకులు సీహెచ్ దీనకుమార్ అన్నారు. వివిధ గ్రామాల్లో పశు వైద్యులు పశువులకు వేస్తున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్యాధికారుల పర్యవేక్షణలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వెయ్యడం జరుగుతోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట



డబ్బివీధి రామమందిరం వద్ద సీతారాముల కల్యాణానికి వేస్తున్న ముహూర్తపు రాట

సాలూరు: శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి పట్టణంలో డబ్బివీధి రామమందిరం వద్ద ముహూర్తపు రాటను ఆదివారం వేశారు. పతివాడ గంగరాజు, లక్ష్మి దంపతులచే ముహూర్తపు రాటను శాస్త్రోక్తంగా వేశారు. దీంతో ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

గడ్డి మందు తాగిన వ్యక్తి

సీతానగరం: మండలంలోని చెల్లన్నాయుడువలస పొలంలో గడ్డి మందు తాగి ఓ వ్యక్తి అపస్మారక స్థితిలోకి చెందాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు... చెల్లన్నాయుడువలస గ్రామానికి చెందిన దాసరి మురళి తన పొలంలో ఉన్న గడ్డి మందు తాగారని సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లి ప్రథమ చికిత్స అందించినట్టు తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వైద్య శిబిరం



సంగంవలస గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాహితి

పార్వతీపురం టౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా మండలంలోని సంగంవలస గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారిణి సాహితి ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 రోజులకొకసారి గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది తమ సేవలు అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి, చేపట్టే ఈ ప్రవేశాలకు 2010 సెప్టెంబరు నుంచి 2014 ఆగస్టులోపు పుట్టిన ఎస్సీ, ఎస్టీ బాలికలు, 2012 సెప్టెంబరు నుంచి 2014 ఆగస్టు 31వ తేదీలోపు పుట్టిన బీసీ, ఓసీ బాలికలు అర్హులన్నారు. ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు అధిగమించాలి

జియ్యమ్మవలస: పీఎంజీవై, మనబడి నాడు-నేడు పథకం, ఇతర అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీఓ రమేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వస్తున్న ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని, వారి సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అర్హులకే పథకాలు అందేలా చూడాలని తెలిపారు. అంతకుముందు రికార్డులు పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు.

వేడుకగా రామమందిరం ప్రతిష్ఠోత్సవాలు

సీతానగరం:

మండలంలోని టీటీడీ - సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన రామమందిరం ప్రతిష్ఠ ఉత్సవాలు ఆగమ వేద పండితుడు మైలారబట్ల ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. సమరసత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో పార్వతీపురం మన్యం జిల్లాలో మొదటి విడతగా మంజూరు చేసిన నిధులతో నిర్మించిన ఆలయాల్లో చిన్నారాయుడుపేట ఒకటి.



స్వామివారి చక్రస్నానానికి బిందెలతో నీరు తెస్తున్న మహిళలు



ప్రతిష్ఠించడానికి సిద్ధం చేసిన పూర్ణకలశం, దేవతామూర్తులు

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండు రోజుల జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు చేసిన కృషితో ఆలయ నిర్మాణం వేగవంతమైంది. రామమందిరం ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆగమ వేద పండితుల సూచన మేరకు కల్యాణం నిర్వహించేందుకు మహిళా భక్తులు పూజా సామగ్రిని సిద్ధం చేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనరు వాసిరెడ్డి నాగేశ్వరరావు, జోనల్ ధర్మ ప్రచారకులు అడారి గంగాధర్, డివిజన్ స్థాయి ప్రచారకులు దేవళ్ల సురేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీ

● మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



పార్వతీపురం టౌన్: సకాలంలో ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం జీఓఎంఎస్ నెం.34 ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘ పరిధిలో ఆస్తి, ఖాళీ జాగా పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని వన్ టైమ్ మెజర్‌గా మాఫీ చేయడం జరిగిందన్నారు. అయితే పన్ను చెల్లించవలసిన, పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకేసారి ఈ నెల 31లోపు చెల్లించినట్లైతేనే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు, ఈ యొక్క సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ మినహాయింపు లబ్ధిని పొందాలన్నారు. పన్నులు మున్సిపల్ ఆఫీసు ఇంటి పన్నుల వసూళ్ల కౌంటర్ - వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చునన్నారు. అంతే కాకుండా పన్నులను ఆన్‌లైన్ ద్వారా (హెచ్‌టీటీపీఎస్: //సీడీఎంఏ.ఏపీ.జీఓవీ ఇన్/) నెట్-బ్యాంకింగ్ ద్వారాగానీ, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారాగానీ యూపీఐ ద్వారాగానీ చెల్లించవచ్చునన్నారు.

ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టును తరలించొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

సాలూరు: ఐసీడీఎస్‌ల విలీనంలో భాగంగా సాలూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టును వేరే ప్రాంతానికి తరలించవద్దని అంగన్‌వాడీలు కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు మహేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి సుమారు 40 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నాయని తెలిపారు. వాహన సౌకర్యాలు లేని గిరిశిఖర గ్రామాలు సుమారు 70 శాతం ఉన్నాయన్నారు. ప్రస్తుత రూరల్ ఐసీడీఎస్ కార్యాలయం అందరికి అన్ని విధాలా అందుబాటులో ఉన్నదని తెలిపారు. దీనిని తరలిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు స్పందించి, తమ సమస్యను అర్థం చేసుకుని ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టును తరలించవద్దని కోరారు. అనంతరం తహసీల్దార్ భానుప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు జ్యోతి, నారాయణమ్మ, సుభద్ర, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాలకు మించిన దగ్గు క్షయ కావచ్చు



మాట్లాడుతున్న టీబీ సూపర్‌వైజర్ నరేష్

సాలూరు: రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం క్షయ కావచ్చని టీబీ సూపర్‌వైజర్ నరేష్ అన్నారు. పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌లో విద్యార్థినులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బరువు తగ్గడం, ఆకలి మందగించడం తదితర టీబీ వ్యాధి లక్షణాలను వివరించారు. పోషకాహార లోపాల వల్ల అంటువ్యాధులు, రక్తహీనత వస్తుందని తెలిపారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన

గరుగుబిల్లి: మండలంలోని రావివలస గ్రామంలో క్షయవ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అరుణకుమారి మాట్లాడుతూ తరచూ దగ్గు వస్తే ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించాలన్నారు. క్షయతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, క్షయవ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది జి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో రావివలస పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

30 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు

కురుపాం: మండలంలోని జి.శివడ జీసీసీ డిపో పరిధిలోని రాముడుగూడ గ్రామంలో 30 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేసినట్లు గుమ్మలక్ష్మీపురం జీసీసీ పాయింట్ సూపరింటెండెంట్ సాంబమూర్తి శుక్రవారం తెలిపారు. జీసీఎం సొసైటీ మేనేజర్ వి.కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎంఎస్‌పీ(మినిమం సపోర్ట్ ప్రైస్) ప్రకారం కిలో రూ.32.40 కింద చింతపండు కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. దళారులను నమ్మవద్దని, గిరిజన రైతులను కోరారు.



రాముడుగూడ గ్రామంలో చింతపండు కొనుగోలు చేస్తున్న జీసీసీ అధికారులు

భక్తిశ్రద్ధలతో శిలువ యాత్ర



శిలువ యాత్రలో క్రైస్తవులు

భామిని: మండలంలోని తివ్వాకొండల్లో ఏసు క్రీస్తు శిలువ యాత్ర శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నల్లరాయిగూడ చర్చ్ ఫాదర్ డోమినిక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రైస్తవులంతా పాల్గొని, క్రీస్తును ఆరాధించారు. పవిత్ర గ్రంథం బైబిల్‌లోని ముఖ్యాంశాలను వివరించి, జీసస్ బోధనలు అనుసరించాలని కోరారు.

నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

భామిని: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం నిరసన చేపట్టారు. రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు మధ్యాహ్నం చేపట్టిన ఈ కార్యక్రమంలో సకాలంలో జీతాలు చెల్లించాలని, డీఏ బకాయిలు ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు నీలాపు అప్పారావు, డీటీలు నిమ్మల శేఖరం, జె.రమేష్‌కుమార్, ఆర్ఐ రాంబాబు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

పాలకొండ: యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని వక్తలు తెలిపారు. మండలంలోని అన్నవరం పీహెచ్‌సీలో గ్రామీణ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్)లకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వక్తలు ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మెంటాడ: మండలంలోని కొంపంగి, మీసాలపేట గ్రామాలకు చెందిన గోపీనాథ్ పట్నాయక్ చెరువు అభివృద్ధి పనులకు వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెరువు కింద సుమారు 200ఎకరాల వరకూ సాగునీరు అందించేందుకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటలకు సాగునీరును అందించేందుకు రైతులు కోరిక మేరకు ఈ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచ్‌లు కూనిబిల్లి వెంకటరమణ, మహంతి రామునాయుడులతో పాటు రాయిపిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి

సీతానగరం: విద్యార్థులు ఒక ప్రణాళికతో చదివి త్వరలో జరగబోయే టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ జిల్లా అధికారి కృష్ణయాజీ అన్నారు. నిడగల్లు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.శివున్నాయుడు అధ్యక్షతన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారి అయినా తనకు విద్యార్థులకు పాఠాలు చెప్పడం అలవాటన్నారు. మంచిగా చదివి సత్ఫలితాలు సాధించేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా కృష్ణయాజీని విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, పీఆర్ డీఈఈ మామిడి రత్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పీఆర్ ఇంజినీరింగ్ అధికారి కృష్ణయాజీని సత్కరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మహిళలకు ఆరోగ్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.టి.రాధాకృష్ణ

సాలూరు: మహిళలు ఆరోగ్యంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి.రాధాకృష్ణ అన్నారు. వరల్డ్ ఉమెన్స్ డే వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మరియు మెడికల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా యోగా మరియు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌కు సంబంధించి అవగాహన ఉంటే ప్రాథమిక దశలోనే దానిని పూర్తి స్థాయిలో వైద్యులు సహకారంతో నిర్మూలించగలరని అన్నారు. యోగా తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసమూర్తి, ఐసీడీఎస్ పీఓ సత్యవతి, డాక్టర్లు అనీల్‌కుమార్, శ్రీహర్షిత, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం డ్రై డే

పార్వతీపురం టౌన్: ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని బందులుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బాలగుడుబ సబ్ సెంటర్లో నిర్వహించిన డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు ఆయన పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఇందులో భాగంగా మురికి కాలువలను శుభ్రపరచాలని, నీరు నిలవ లేకున్నా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంలో బాలింతలను, గర్భవతి ఇళ్లు సందర్శించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్నాథరావు, మెడికల్ ఆఫీసర్ (ఎంఓ) డాక్టర్ తిరుమల ప్రసాద్, సర్పంచ్ సూర్యానారాయణ, సీహెచ్‌ఓ జగదీష్‌కుమార్, ఏఎన్‌ఎం రామలక్ష్మి, ఆశ, సీహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.



గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

పాలకొండ రూరల్: సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి అని ఎంపీడీఓ డొంక త్రినాధులు సూచించారు. మండలంలోని అంపిలి, ఎం.సింగుపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన ప్రజాసమస్యలు-వాటి పరిష్కారంపై ఆరాతీశారు. అనంతరం అక్కడి సచివాలయాలను సందర్శించి, రికార్డుల నిర్వహణ, ప్రజలకు పథకాలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అంపిలి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఆరాతీసి, మెనూ ప్రకారం పిల్లలకు వంటకాలు వండిపెట్టాలన్నారు.



మధ్యాహ్న భోజనం వంటలపై ఆరాతీస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

అకాల వర్షం.. అపార నష్టం

- రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు
- పలుచోట్ల ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షం
- 260 ఎకరాలకు పైగా పంటనష్టం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



గరుగుబిల్లి: నేలకొరిగిన అరటి పంట

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర, బాసంగి, వెంకటరాజపురం, గవరంపేట గ్రామాల్లో గురువారం రాత్రి అకాల వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని అరటి, మొక్కజొన్న, ఇతర పంటలు బాగా దెబ్బతిన్నాయి. వర్షంతో పాటు వీచిన ఈదురుగాలులకు దాదాపు 150 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు సమాచారం. వేలకు వేల రూపాయలు మదుపులు పెట్టి, పండించిన పంట ఒక్కసారిగా పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పంట నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కొమరాడ: మండలంలోని కళ్లికోట, దుగ్గి, గుణానపురం గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ఆయా గ్రామాల్లోని పలు పంటలు పాడయ్యాయి. కళ్లికోటకు చెందిన రైతు శీర తిరుపతిరావు ఐదెకరాల్లోని మొక్కజొన్న పంట నాశనం కాగా, ఈ మేరకు ఆయన ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భామిని: మండలంలోని నేరడి-బి, గురండి, బిల్లుమడ, కాట్రగడ-బి గ్రామాల్లో గురువారం కురిసిన వర్షానికి అక్కడి మొక్కజొన్న సహా ఇతర పంటలకు నష్టం జరిగింది. నేరడి-బి గ్రామంలో దాదాపు 10 ఎకరాల్లోని మొక్కజొన్న పంట ఈదురుగాలులకు నేలకొరిగింది.

గరుగుబిల్లి: మండలంలోని గిజబ, నందివానివలస, సంతోషపురం గ్రామాల్లో గురువారం రాత్రి భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షానికి అక్కడి మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆయా గ్రామాల్లోని దాదాపు 100 ఎకరాల్లోని పంట నేలమట్టం కాగా బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా పంట బాగుందన్న సమయంలో అకాల వర్షం తమ కొంప ముంచిందని వాపోతున్నారు. అధికారులు స్పందించి, నష్టపరిహారం వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కొమరాడ: కళ్లకోట గ్రామంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు



భామిని: నేలకొరిగిన మొక్కజొన్న పంటలో వర్షపునీరు



గరుగుబిల్లి: నేలమట్టమైన మొక్కజొన్న, అరటి పంటలను సరిచేస్తున్న మహిళా రైతు